క్లుప్తంగా

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

శావల్యాపురం: వైఎస్సార్ చేయూత పథకంలో 45 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళ లబ్ధిదారులు నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలోని వలంటీర్లు అర్హత కలిగిన మహిళ లబ్ధిదారుల సమగ్ర వివరాలతో కూడిన ఆధార్, రైస్‌కార్డు, కుల, ఆదాయ, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను సేకరించాలన్నారు. తదుపరి ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని వేల్ఫేర్ అసిస్టెంట్ పరిధిలో నూతన లబ్ధిదారుల ఆన్‌లైన్‌లో ఫొటో నమోదుతో పాటు సమగ్ర వివరాలను న మోదు చేసుకోవాలన్నారు. గతంలో పొందిన లబ్ధిదారులందరూ రెన్యూవల్స్ చేయించుకోవాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన సేవలు

బొల్లాపల్లి: వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సరికొండపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బంది వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి జి.వీరనరేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాల్లో వైద్యసేవలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 102 మందికి సాధారణ చికిత్సలు, 85 మందికి షుగర్, బీపీ, గర్భిణులు, బాలింతలు 8 మంది, 14 మంది క్యాన్సర్ అనుమానితులకు వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రుణాలు మంజూరు

శావల్యాపురం: 7వ విడత జగనన్న తోడు పథకంలో అర్హత కలిగిన చిరు వ్యాపారులందరికీ రుణాలు మంజూరు చేయించాలని ఏపీయం జి.వాసుబాబు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకంలో ఏపీయం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 336 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడానికి లక్ష్యంగా ఎంచుకొనగా, ఇందులో భాగంగా దరఖాస్తులు స్వీకరణతో బయోమెట్రిక్ నమోదు పనులు జరుగుతున్నాయన్నారు. ఒక్కొక్క మహిళా లబ్ధిదారులకు రూ. 10 నుంచి 13 వేల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రుణాలు సకాలంలో చెల్లింపులు చేసిన లబ్ధిదారులకు వడ్డీ రాయితీ ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు పరిధిలో 148 మంది లబ్ధిదారులు ఉండగా గతంలో తీసుకున్న లబ్ధిదారులు రుణాలు చెల్లింపులు సక్రమంగా లేదని అటువంటి వారిని గుర్తించి సత్వరమే చెల్లింపులు జరిగేలా క్షేత్రస్థాయిలో సీసీలు, యానిమేటర్లు, బాధ్యత వహించాలన్నారు. ఆయనతో పాటు సీసీలు ఖాజావలీ, బేబిరాణి, గొట్టం రమాదేవి ఉన్నారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వినుకొండ ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో డ్రైవ్ నిర్వహించగా అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయభాస్కర్ రావు తెలిపారు. స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న జక్కా పుల్లారావును అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద ఉన్న 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామ న్నారు. అదేవిధంగా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో పన్ను చెల్లించని గోవా రాష్ట్రానికి చెందిన మద్యంను విక్రయిస్తున్న మండది వెంకట శివనాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి వినుకొండ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.

చర్చి ఆవరణలో అన్నదానం

యడ్లపాడు (నాదెండ్ల): మండల కేంద్రమైన యడ్లపాడులోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న, వస్త్రదానం నిర్వహించారు. చర్చి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే 50 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. వస్త్రాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కారసాల బుల్లెమ్మాయి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీశ్రీనివాసరావు, తేలప్రోలు సురేష్‌కుమార్, అంకమ్మరావు, ప్రసాద్, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి కమలాబాబు, అశోక్, సుబ్బు, పున్నారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీ.. అలర్ట్!



వినుకొండ హనుమాన్‌నగర్ యూపీహెచ్‌సీ, నూజెండ్ల పరిధిలోని అప్పాపురం, శావల్యాపురం పీహెచ్‌సీలను జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ బుధవారం సందర్శించారు. పీహెచ్‌సీల్లోని ల్యాబ్‌లను తనిఖీ చేశారు. అప్పాపురం గ్రామంలో డెంగ్యూ, మలేరియా వ్యాధి నివారణ చర్యల గురించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎస్‌వీ సుబ్బారావు, పి.బాలస్వామి, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

నెలాఖరులోగా రీసర్వే పనులు



రీసర్వే పనులు ఈనెలఖారులోగా పూర్తిచేస్తామని తహసీల్దారు జాన్‌సైదులు వెల్లడించారు. మండలంలోని పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో 3505 ఎకరాల విస్తీర్ణం కల్గిన భూములను రైతులు సమక్షంలో రెవెన్యూ అధికారులు ఆధునిక యంత్ర పరికరాలతో సర్వే పనులు పూర్తి చేశామన్నారు. ఇందులో భాగంగా 1320 మంది రైతులను గుర్తించి సర్వే నంబర్లు ఆధారంగా ఫామ్ 9(2) నోటీసులు రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పిచికలపా లెం రీసర్వే రికార్డు పనులను పరిశీలించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వెంకట నాగరాజు, వీఆర్వో అమల ఉన్నారు.

–శావల్యాపురం

ఉన్నతంగా ఎదగాలి



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. స్టేషన్ రోడ్డులోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల గ్రంథాలయానికి ఎన్ఆర్ఐఏ పుస్తకమిత్ర ప్రతినిధులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో కథలు, జీవిత చరిత్రలు, సైన్స్, సాహిత్యం పుస్తకాలను అందచేశారు. జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రామమోహనరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కుమారి, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

–నరసరావుపేట ఈస్ట్

క్షుణ్ణంగా పరిశీలించాలి



బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించాలని ఎన్నికల ప్రత్యేక అధికారి జి.వసంతబాబు సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. వారి నుంచి సూచనలు స్వీకరించారు. ఈ జీరో డోర్ నంబర్లు ఉన్న ఇళ్లను ప్రత్యేకంగా పరిశీలించి సరిచేయాలని, జంబ్లింగ్ డోర్ నంబర్లను సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

–చిలకలూరిపేటటౌన్

జగనన్న అందరి బంధువు

- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- ప్రభుత్వానికి అండగా ప్రజలు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అందరి బంధువు ముఖ్యమంత్రి జగనన్న అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ధైర్యం, మన ఆశ, మన ధీమా అన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని వివరించారు. పేదలు ఈ రోజున రాష్ట్రంలో ఎంతో సంతోషంగా ఉన్నారంటే దానికి కారణం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వెల్లడించారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలలు కొత్త హంగులు సంతరించుకున్నాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని అన్ని వ్యాధులకు వర్తింపజేసి ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తిగా భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. దీంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణం శరవేగంగా చేస్తున్నారని వివరించారు. మరోవైపు అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తూ రైతు ప్రభుత్వంగా రైతాంగం నుంచి మెప్పు పొందుతున్నారని వెల్లడించారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల ముంగిటికే అన్ని రకాల సేవలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయడం నుంచి రైతుల తరుపున బీమాను సైతం ప్రభుత్వమే చెల్లిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి పాలన మళ్లీ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యడ్లపాడు జెడ్పీటీసీ సభ్యుడు ముక్తా వాసు, ఉన్నవ గ్రామ సర్పంచ్ దంటు సరళ, ఎంపీటీసీ–1 గుత్తి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ–2 యడ్లపల్లి సత్యవతి, సొసైటీ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణయ్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంటా శంకర్ పాల్గొన్నారు.

కపలవాయి జ్యూయలర్స్‌లో వజ్రాల విభాగం

ఆరంభించిన ఎస్పీ రవిశంకరరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో తొలిసారిగా కపలవాయి విజయకుమార్ జ్యూయలర్స్‌లో రియల్ డైమండ్స్ వ్యాపారం ప్రారంభించటం అభినందనీయమని జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి తెలిపారు. మెయిన్‌రోడ్డులోని కపలవాయి విజయకుమార్ జ్యూయలర్స్‌లో ఏర్పాటు చేసిన వజ్రాల నగల ప్రదర్శన, గాజుల మేళా, అమ్మకాలను బుధవారం ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన వజ్రాల విభాగాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలుదారులకు అధునాతన డిజైన్‌లతో వజ్రాల నగలను సరైన ధరలకు విక్రయించాలని తెలిపారు. కాగా, తమ జ్యూయలర్స్‌లో ఈనెల 16వతేదీ నుంచి 19వ తేదీ వరకు వజ్రాల నగలు, గాజుల ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని జ్యూయలర్స్ యజమాని, రాష్ట్ర బంగారు, వెండి వర్తకుల సంఘం అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ తెలిపారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా క్యారెట్ రూ.54 వేలు మాత్రమేనని తెలిపారు. తమవద్ద కొన్ని రకాల ఆభరణాలను విజయవాడ ధర కన్నా తగ్గింపు ధరకే నాణ్యతతో అందిస్తామ ని తెలిపారు. అలాగే బంగారు నగలపై మజూరీ, తరుగు లేదని వివరించారు. వివాహాది శుభకార్యాలకు అవసరమైన ప్రత్యేక ఆభరణాలు తమషాప్‌లో లభిస్తాయ ని తెలిపారు. డీఎస్పీ మహేష్, దత్త హాస్పిటల్ వైద్యు లు డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ జ్ఞానేశ్వరి, బంగారు వర్తకులు పెనుగొండ వెంకటేశ్వరరావు, గొడవర్తి చంద్రశేఖర్ రావు, ఆత్మకూరి ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.



వజ్రాల విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రవిశంకరరెడ్డి

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

ఏడీఏ మస్తానమ్మ



గణపవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ, పక్కన ఏవో హరిప్రసాద్

నాదెండ్ల: పత్తి విత్తే సమయం దాటినందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. గణపవరంలోని 1వ సచివాలయంలో బుధవారం రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి విత్తే సమయం ముగిసిందని చెప్పారు. గతేడాదికన్నా ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ఆగస్టు15 తర్వాత నాటిన పత్తికి గులాబీరంగు పురుగు సోకే అవకాశం ఉన్నందున రైతులు పత్తి సాగు చేయొద్దని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలైన మిర్చి, కంది, ఇతర పంటలు సాగుచేసుకోవాలన్నారు. సెప్టెంబర్ ముగిసే సమయానికి ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున రైతు భరోసా కేంద్రంలోని సిబ్బంది ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. సాగులో మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకంపై ఫొటోల చించివేత



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు ప్రధాన కూడలిలో ఇటీవల ఏర్పాటు చేసిన వైఎస్సార్ శిలాఫలకంపై సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు డిజిటల్ ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కృష్ణా నదిలో లభ్యమైన మృతదేహం గుర్తింపు

అచ్చంపేట: మండలంలోని కోనూరు, కస్తల గ్రామాల మధ్యలో గల కృష్ణానదిలో ఈ నెల 12న కన్పించిన మృతదేహం గుర్తింపు లభించింది. అచ్చంపేటకు చెందిన షేక్ హుస్సేన్ కుమారుడు ఉస్మాన్(14)గా బుధవారం పోలీసులు గుర్తించారు. ఉస్మాన్ హోటల్లో సర్వర్‌గా పనిచేస్తూ ఈనెల 11న స్నేహితులు రబ్బాని, సైదా అలియాస్ పండులతో కలసి కోనూరు కృష్ణానదిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఉస్మాన్ కనిపించకపోవడంతో చేసేది లేక మిగిలిన ఇద్దరు ఇంటికి వెళ్లారు. కుమారుడి ఆచూకీ గురించి హుస్సేన్ వెతుకుతుండగా, దినపత్రికల్లో వచ్చిన వార్త సహాయంతో పోలీసుల్ని ఆశ్రయించారు. మార్చురీలో ఉన్న మృతదేహం తన కుమారుడు ఉస్మాన్‌దిగా ఆయన గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

అవయవదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



మాట్లాడుతున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా అమర్

చిలకలూరిపేట: అవయవదానంతో ప్రాణదాతలుగా నిలవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చిలకలూరిపేటశాఖ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా అమర్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూల్ ప్రాంగణంలో అవయవదానంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవదానం చేయడానికి సిద్ధపడితే ఎనిమిది మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని చెప్పారు. కిడ్నీ, లివర్, గుండె, కళ్లు వంటి అవయవాలను దానం చేయవచ్చన్నారు. మరో వైద్యుడు డాక్టర్ కందిమళ్ల వాసుదేవ్ మాట్లాడుతూ మతాచారాలు, మూఢాచారాల నుంచి బయటపడి అవయవదానానికి ముందుకు రావాలన్నారు. అవయవదానంతో చిరంజీవులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, తోటకూర వెంకటనారాయణ, డాక్టర్ పీవీ సుబ్బారావు, ఈదర గిరీష్‌బాబు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దేవస్థానంలో మొక్క నాటుతున్న పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

క్రోసూరు: ఆధ్యాత్మికతకు నిలయమైన దేవాలయాల్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి టి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. క్రోసూరు పరిధిలోని సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, వీరభద్రమల్లేశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాల్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సత్తెనపల్లి డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతిని ఆదేశించారు. ప్రభుత్వం అర్చకులకు కల్పిస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించి లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈవోలు విజయభాస్కరరెడ్డి, ముదిగొండ పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదును పర్యవేక్షిస్తున్న ఏవో వేణుగోపాల్



నందిగామలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో శ్రీధర్‌రెడ్డి

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ- పంట నమోదు ప్రారంభమైందని, రైతులంతా తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని ఆవులవారిపాలెంలో బుధవారం పంట నమోదును ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ- పంట నమోదు చేసుకోవడం వల్ల ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నావడ్డీ పంట రుణం, కనీస మద్దతు ధర వంటి ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. మండలంలో ఇప్పటికీ 4488 హెక్టార్లలో పత్తి, 7.14లో హెక్టార్ల కంది, 0.40 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు తెలిపారు. సాగు చేస్తున్న రైతులంతా పొలం పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ ఫొటోస్టాట్‌తో పాటు ఫోన్ నంబర్‌తో గ్రామ రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి, ఈ- పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సత్తెనపల్లిలో..

రైతులందరూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి యస్.శ్రీధర్ రెడ్డి చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలో క్షేత్రస్థాయిలో సిబ్బందితో ఈ–పంట నమోదుతో పాటు పంట పొలాల్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడు తూ ఈ- పంట నమోదు చేసుకోవడం వల్ల రైతు లకు ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర, రుణాలకు సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పంటల నష్ట పరిహారం అందడానికి ప్రతి రైతూ చేయించుకోవాలని ఆయన సూచించారు. సాగు చేస్తున్న పంటల్ని భూ యజమాని, కౌలు రైతులు తప్పకుండా గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లి సిబ్బందితో నమో దు చేయించుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు గోపాలం గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు హోలీ ఫ్యామిలీ విద్యార్థుల ఎంపిక



సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సత్తెనపల్లి హోలీ ఫ్యామిలీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా తరపున హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థులు యశ్వంత్, ఎస్.ప్రణీత్, తులసీరామ్ పాల్గొన్నారు. ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు యశ్వంత్, ఎస్.ప్రణీత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థుల్ని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రికెట్ టోర్నీలో రామాంజనేయులు ప్రతిభ

సత్తెనపల్లి: బెంగళూరులో ఈనెల 11 నుంచి 15 వరకు జరిగిన సౌత్ ఇండియా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల క్రికెట్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. రాజుపాలెం మండలం అంచులవారిపాలెం గ్రామ సర్పంచ్, న్యాయవాది అంచుల రామాంజనేయులును భారత క్రికెట్ టీం వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రత్యేకంగా అభినందించారు. క్రికెట్ టోర్నమెంటులో ప్రతిభ చూపిన రామాంజనేయులును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

అబాకస్ పోటీల్లో కృష్ణ వికాస్‌కు ర్యాంక్

సత్తెనపల్లి: వీపీ అబాకస్ పోటీల్లో మూడు జిల్లాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన రెడ్డి కృష్ణ వికాస్‌ను బుధవారం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కృష్ణ వికాస్ రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆవోప పట్టణ అధ్యక్షుడు మోటమర్రి చందు, మాజీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం సంఘం ట్రెజరర్ బచ్చు సందీప్, రెడ్డి సురేష్, స్వామి ప్రసాద్, దేవరపల్లి రాఘవ, దేవరపల్లి కాశీ విశ్వనాథం, దేవరశెట్టి కిశోర్, శ్రీను, భవాని మెడికల్స్ హరి, పొట్టి మురళి, పేరుమళ్ల శ్రీనివాసరావు, కృష్ణ వికాస్ తండ్రి రెడ్డి శీను పాల్గొన్నారు.